## 7.2.9 స్త్రీవాద కవిత్వం

ఈ భూమిపై ఒకేసారి జీవనం మొదలు పెట్టిన స్త్రీ పురుషులిద్దరూ జాతి ఉత్పత్తిలో సమప్రాధాన్యం గలవారు. స్త్రీ వ్యక్తిత్వం పునాదిగా నడచిన వ్యవస్థ మాతృస్వామ్య వ్యవస్థ అనేది ఒకానొక సామాజిక దశలో ఉండేదని చెబుతున్నా, ఏ సామాజిక దశలోనైనా పురుషుడితో సమాన హోదా స్త్రీ సాధించినట్లుగానీ, అనుభవించినట్లుగానీ కనిపించదు.

రాతియుగం వరకు స్త్రీలే సమాజంలో, వ్యవసాయ రంగంలో ముందంజ వేయడం వలన గౌరవం ఉండేది. ప్రపంచంలోని అన్ని తెగలలో తల్లే రకరకాల దేవతలుగా అన్ని ప్రాంతాలలో అనేక పేర్లతో వ్యవహరించబడింది. అంకమ్మ, గంగమ్మ, పెద్దమ్మ, నూకాలమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, రేణుకమ్మ, ముత్యాలమ్మ... మొదలైనవారు మాతృస్వామ్య వ్యవస్థ ఉండటం వల్లనే గ్రామదేవతలుగా అవతరించారు. స్త్రీని శక్తిగా, సృష్టికర్తగా, ప్రకృతికి అధినేతగా చిత్రించారు. మాత పురాణంలో మాతయే హరిహర బ్రహ్మాదులకు త్రిలోకాలను ప్రసాదించిందనీ, ఆమె అనుగ్రహం చేతనే శైవ, వైష్ణవ మతాలు ఏర్పడ్డాయని జానపదులు విశ్వసిస్తున్నారు.

సింధూ నాగరికత కాలం మాతృస్వామిక సంస్కృతికి చివరియుగం. స్త్రీని ప్రకృతిగా భావించి ఆరాధించారు. సృష్టికి స్త్రీ మూలమన్నారు. స్త్రీని పంట దేవతగా కొలిచారు. పునరుత్పత్తి విజ్ఞానం లేని పురుషునికి స్త్రీ ఒక అద్భుతశక్తిగా కనిపించింది. వ్యవసాయం, పశుపోషణ మూలంగా, లైంగిక విభజన వలన స్త్రీలు ఇంటికి పరిమితం కావడం, ఉత్పత్తికి దూరమై పురుషునిపై ఆధారపడటం మొదలైంది. ఈ విధంగా మాతృస్వామ్యం వెనుకబడి పితృస్వామ్యం ముందంజ వేసి ఆధిపత్యాన్ని వహించి లైంగిక వివక్షకు దారితీసింది.



వేదకాలంలో విశ్వవార, లోపాముద్ర, గార్గి, మైత్రేయి మొదలైన స్త్రీలు ఋషులుగా గౌరవింపబడినప్పటికీ అథర్వణ వేదకాలంలో స్త్రీల పరిస్థితి దయనీయమైంది. ఋగ్వేదం స్త్రీని అబలగా సూచించింది. దస్యుల్లో పురుషులతోపాటు స్త్రీలు కూడా యుద్ధం చేశారని అబలా సైన్యం నన్నేమి చేస్తుందని ఇంద్రుడు ప్రకటించాడు (ఋగ్వేదం-పంచమండలం). అథర్వణ వేదంలో స్త్రీలను పాచికలతోనూ, మద్యంతోనూ పోల్చడాన్ని గమనించవచ్చు. బ్రాహ్మణుల కాలం నాటికి క్రతువులు, కర్మకాండలు పెరిగి స్త్రీకి గౌరవం తగ్గింది. (అథర్వణవేదం, మైత్రేయిసంహిత). పున్నామ నరకం నుండి సముద్ధరించేవాడని భావింపబడే పుత్రునికి ప్రాధాన్యం పెరిగి, భార్యకు పుత్రసంతానమే కలగాలని భర్త ప్రార్థించడం కనిపిస్తుంది. నారదుడు హరిశ్చంద్రునికి పుత్రసంతానం ప్రాధాన్యాన్ని వివరించాడు. కుంతీదేవి, గాంధారి వంటివారు తమను అపుత్రతకు విషయభూతులనుగా చేయకు అని అగ్ని దేవుని ప్రార్థించటం, దిలీప మహారాజుకు వశిష్ఠ మహర్షికి సంతానం లేనందువలన కలిగే విషాదాన్ని వెల్లడించటం, అన్ని రత్నాల కంటే పుత్రరత్నమే శ్రేష్ఠమని సూచించటం కనిపిస్తుంది.

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' అన్న లోకంలోనే 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని మనుస్మృతి పేర్కొంది. భర్తను దూషించే స్త్రీ అనేక మార్లు కుక్కగా, పందిగా పుడుతుందని పరాశర స్మృతి తెలియజేస్తుంది. భర్తతో సహగమనం చేస్తే మూడుకోట్ల యాభైలక్షల సంవత్సరాలు స్వర్గంలో నివసిస్తుందని వివరిస్తుంది. ఆడపిల్లలను కంటున్న స్త్రీని పన్నెండవ సంవత్సరంలో విడిచిపెట్టి మరొక స్త్రీని పుత్రుడికోసం వివాహం చేసుకోవచ్చని బోధాయనుని ధర్మశాస్త్రం తెలుపుతుంది. ప్రకృతి గతంగా ఆమెకు సంక్రమించిన బలహీనతలు ఆమెను అబలగా చిత్రించడానికి దోహదపడ్డాయి.

రామాయణ, మహాభారత రచనాకాలం నాటికి ధర్మప్రబోధాల ప్రాధాన్యం అధికమై పత్నీ వైశిష్ట్య ప్రబోధకాలు, పత్నీ విధి నిషేధ ప్రబోధకాలు కవిత్రయ రచనలలో కానవస్తున్నాయి. పాతివ్రత్యంగల స్త్రీ దైవ సమానురాలని బోధించారు. బౌద్ధం స్త్రీకి సామాజికంగా గొప్ప గౌరవాన్నిచ్చి సత్కరించింది. సన్యాసినులుగా మారగలిగే అధికారం బౌద్ధమతం ఇచ్చింది. హిందూమతంలోని భాగమైన వీరశైవ మతం కూడా బౌద్ధ జైన మతాల్లోని స్త్రీ పురుష సమానత్వాన్ని స్వీకరించింది. పతి భక్తితో కాకుండా పరమేశ్వర భక్తితోనే మోక్షం పొందుతారని ప్రబోధించింది. వీరశైవ మతోద్యమ ప్రభావంవల్లనే కాకతీయుల కాలంలో స్త్రీలు పురుషులతో సమానంగా రాజ్యాన్ని పరిపాలించారు (ఉదా: రుద్రమదేవి, గణపాంబ). స్త్రీ తగవులకి మూలమని వేమన్న భావించగా, స్త్రీ చంచల స్వభావం గలదని అన్నమయ్య స్త్రీని మోహపు వస్తువుగానే చూశారు.

"పొలతి నమ్మగరాదు పురుషులనెపుడు
పలురీతి కృష్ణ సర్పములై యుండ్రు" – సుభద్రా కళ్యాణం.

అని ఉమ్మడి కుటుంబంలోని పురుషుల స్వభావాన్ని ధైర్యంగా చెప్పగలిగిన తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క. ప్రబంధ యుగంలో కవులందరూ సంభోగ, వియోగ శృంగారరాలకు ప్రాధాన్యం ఇచ్చి స్త్రీని భోగ్య వస్తువుగా భావించి వర్ణించారు. సాహిత్య ప్రపంచంలో స్త్రీని ఈ రకంగా నిలబెట్టిన కవుల భావజాలంలోనే ముద్దు పళని రాధికాస్వాంతనం నడిచింది.

తెలుగు సాహిత్యంలో స్త్రీని గురించిన భావజాలం ఈ విధంగా ఉండగా, ఎంతగానో ముందంజ వేసిన పాశ్చాత్య సాహిత్యంలో కూడా స్త్రీలను గురించిన భావజాలం ఈ విధంగానే కనిపిస్తుంది. ఆడం, ఈవ్ కథను దృష్టిలో పెట్టుకుని బర్న్ ఈ విధంగా చెప్పాడు.



"As father Adam first was fool'd
A case that's still too common
Here lies a man a woman rul'd
The devil rul'd the woman
- Burns-Epitaph on Hen pecked country squire.

ఆదాం స్త్రీ చేత పాలింపబడిన అవివేకి కాగా స్త్రీ సైతాను చేత పాలింపబడింది.

Woman was God's second mistake అని నీట్షే (The Anti-christ) Woman are only children of a larger growth అని లార్డ్ చెస్టర్ ఫీల్డ్ (లెటర్స్, Sep. 1948 లో) పేర్కొన్నారు.

స్త్రీని ఇలా సంకుచితమైన ఆలోచనలతోనే చిత్రించినట్లు కనిపిస్తుంది. స్త్రీ పురుష సంబంధాన్ని శారీరకమైనదిగానే తప్ప అంతకు మించి స్త్రీని మరో దృష్టితో చూడలేపోయిన దుస్థితి కనిపిస్తుంది.

ఆధునిక కాలంలో స్త్రీ విద్య, స్త్రీ స్వేచ్ఛ అవసరమని స్త్రీని కేంద్రంగా చేసుకొని అనేక సంస్కరణలు బయలుదేరాయి. రాజా రామ్మోహనరాయ్, వీరేశలింగం పంతులు, గురజాడ మొద లైన వారు స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షించారు. సంఘసంస్కరణల ప్రభావం వల్ల సాహిత్యంలో కూడా స్త్రీ అభ్యున్నతిని కాంక్షించే రచనలు వచ్చాయి. భావకవిత్వ కాలంలో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మి, చావలి బంగారమ్మ మొదలైన కవయిత్రులు ఉన్నారు. చలం, గోపీచంద్ రచనల్లో స్త్రీ అభ్యుదయం గురించిన ఆలోచనలు కనిపిస్తాయి. తరువాత కాలంలో స్త్రీల రచనల్లో ఎక్కువగా స్త్రీ సమస్యలను చిత్రించడం కనిపిస్తుంది. విప్లవ సాహిత్యం బలహీన పడుతున్న క్రమంలో ఎవరో తమ విముక్తి కోసం కలం పడతారన్న భావనను స్త్రీలు

తిరస్కరించారు. ఎవరి అనుభవాల్ని వాళ్ళే బలంగా వినిపించగలరనే భావనకు బలంచేకూరి స్త్రీవాద సాహిత్య సృజనకు పునాది అయ్యింది. తెలుగులో విస్తృతమైన స్త్రీవాద సాహిత్యం వచ్చింది. బూర్జువ, పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద సంస్థలకు బలైపోయిన స్త్రీలు అణిచివేతనుండి విముక్తి కోరుతూ రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో ముందంజ వేయడానికి చేసిన ప్రయత్నమే స్త్రీవాదం. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సామాజిక సాహిత్య రాజకీయ రంగాలలో స్త్రీవాదులు సాధించిన విజయాలు:

1. స్త్రీల హక్కుల కోసం స్త్రీలే పోరాటం సాగించారు. రిజర్వేషన్లను పొందడమే కాక విద్యా, ఉద్యోగ రంగాలల్లో ప్రోత్సాహాన్ని పెంపొందించారు.
2. స్త్రీవాద ప్రోత్సాహం వల్లనే దళిత, మైనారిటీ వర్గాల్లోని స్త్రీలు కూడా తమ సమస్యలను సాహిత్యంలో చిత్రించారు.
3. దళిత సాహిత్యం తెలుగు సాహిత్యంలో విస్తరించినంతగా ఏ సాహిత్యంలోనూ కనిపించదు.
4. తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ కథలు సుమారు 150 వరకు ఉన్నాయి. ఈ కథల్లో ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీ సమస్యలు కూడా చిత్రించబడ్డాయి. ఇటువంటి కథా సాహిత్యం మరే సాహిత్యంలోనూ లేదని చెప్పవచ్చు.
5. నవలల్లో రచయితల కన్నా రచయిత్రులే స్త్రీ సమస్యలకు మేలైన పరిష్కారాలు చూపించారు.

"No women in any country seen their lives change so radically as have chinese women, women are half the sky and they are also obsolutly the equal of men". - Mao - Tse-Tung.



'ఆకాశంలో సగం స్త్రీ' అని మావో చెప్పిన మాటలను స్త్రీవాద రచయితలు విరివిగా ప్రయోగించడం గమనార్హం. బ్రహ్మ స్థితిలో తాదాత్మ్యం పొందిన ఒక బ్రహ్మవాదిని ఆకాశాన్ని నేను కన్నాను. ఆకాశానికి పైనా కింద నా ఆధిపత్యమే ఉంది. నా దేహం యావత్ ప్రపంచవ్యాప్తమై ఉంది. వాయువుగా వీచి ఈ ప్రపంచాన్ని సృష్టించాను అని పేర్కొంది. ఈ స్థితిని చేరుకోడానికి కావలసిన స్ఫూర్తి వేదకాలం నాటి మహిళల్లో కనిపిస్తుంది.

"మనం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోంది"[1] సావిత్రి,- బందిపోట్లు

పురుషుడిని కన్నది స్త్రీయే. పెంచి పెద్దచేసిన పురుషుడికి స్త్రీలు భయపడటమేమిటి ? అని స్త్రీవాదులు తమ స్థితిని చిత్రించారు.

చైనాలో బూర్జువ, పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద వ్యవస్థలో జరిగిన అణిచివేతను ఎదుర్కొంటూ స్త్రీలు 20 ఏళ్ళు పోరాడి విజయం సాధించారని చరిత్ర తెలియజేస్తుంది. 1949 నుండి 1976 వరకు సుమారు 27 సంవత్సరాల కాలంపాటు స్త్రీలు అభ్యున్నతిని సాధించారు. 1976 తరువాత మళ్ళీ అణచివేతను ఎదుర్కొంటూనే స్త్రీలు తమ అస్తిత్వ పోరాటాన్ని కొనసాగిస్తూ ఉన్నారు. మన చరిత్రను పరిశీలించినట్లయితే ఆదిమ కాలంలో మాతృస్వామ్య వ్యవస్థలో ఉన్న స్త్రీ సింధునాగరికత కాలంలో శక్తిస్వరూపిణిగా నిలిచి, వేదకాలంలో అబలగా మారింది. తదనంతరం పుత్రత్వమే స్త్రీత్వంగా, పురాణ, ఇతిహాసాల కాలంలో పాతివ్రత్యమే స్త్రీత్వంగా భావించబడింది. స్త్రీని మాతృస్వరూపిణిగా, త్రిగుణాత్మక స్వరూపిణిగా, సృష్టి స్థితి లయకారిణిగా నిలిచిన స్త్రీని మధ్యయుగంలో భోగ వస్తువుగా మార్చారు. పునరుజ్జీవన కాలంలో స్త్రీని ఉదాత్తంగా చిత్రించారు. స్త్రీ మాతృ స్వరూపిణిగా, ప్రేయసిగా భావించబడింది. పారిశ్రామికీకరణ తరువాత

1. నీలిమేఘాలు, స్త్రీవాద కవితా సంకలనం, స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాదు, 1993, పుట 71.

కాలంలో సమాజంలో స్త్రీ స్థానం ద్వితీయ స్థాయికి చేరింది. స్త్రీవాద ఉద్యమం సమానత్వం కోసం స్త్రీ పురుషుల్లో చైతన్యాన్ని కలిగించే ప్రయత్నంలో సమాజాన్ని ముందుకు తీసుకెళ్ళింది. చరిత్రలో నిమ్నోన్నతలు కనిపిస్తూ ఉండటం వల్ల స్త్రీలు తమ అస్తిత్వం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉండాలి లేదా చైనా చరిత్రను చవిచూడవలసి వస్తుంది.

ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో స్త్రీ పురుషుల మధ్య ఉన్న అసమానతలను గురించి చైతన్యవంతులను చేసి సమాజ నిర్మాణంలో ఉన్న వివక్షతను తొలగించాలనే ప్రయత్నంలో అనేక ఉద్యమాలు విస్తరించాయి. ఈ నేపథ్యంలో వెలుగుచూసినదే స్త్రీవాద ఉద్యమం. అంతర్జాతీయ మహిళా దశాబ్ది 1975–1985 వరకు ప్రపంచం మొత్తం మీద మహిళా జీవనం గురించి సామాజిక స్పృహ ఏర్పడి స్త్రీ పురుషులను చైతన్యవంతులను చేసి మహిళా ఉద్యమానికి దారితీసింది.

ఫెమినిజమే సర్వ మానవతావాదానికి ప్రతీక అనే స్థాయికి స్త్రీవాదం ఎదిగింది. సిద్ధాంతపరంగా పరిశీలిస్తే స్త్రీవాదంలో కనిపించే ప్రామాణికాంశాలను గుర్తించవచ్చు.

1. సమాన హక్కుల అవకాశాలు కల్పించాలనే వాదం ఉదారవాద స్త్రీవాదం.
2. పురుషాధిక్య సమాజాన్ని వ్యతిరేకిస్తూ స్త్రీ పురుష సంబంధాలు రాజకీయ పరమైనవి జెండర్, లైంగికత, పునరుత్పత్తి కూడా రాజకీయమేనని చెప్పేవాదం రాడికల్ స్త్రీవాదం.
3. ఉదారవాద స్త్రీవాదుల దృక్పథంలో సోషలిస్టు సమాజ ఆవిర్భావంలో సమస్యలన్నీ తొలగిపోతాయంటుంది సంప్రదాయ మార్క్సిస్ట్ స్త్రీవాదం.
4. స్త్రీ సమస్య ఒక రాజకీయ సమస్య. స్త్రీ సమస్య చారిత్రక సాంస్కృతిక, ఆర్థిక సంబంధమైన అంశమని వర్గభేదం వర్గ దోపిడి నశించినపుడు సోషలిస్టు వ్యవస్థలోనే స్త్రీ విముక్తికి మార్గం ఏర్పడుతుందని అంటుంది ఆధునిక మార్క్సిస్ట్ స్త్రీవాదం.



5. సంతానోత్పత్తి, లైంగికత్వం, సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో పురుషాధిక్యం అనే వాటిని ముఖ్యమైన నిర్ణయాంశాలుగా గుర్తించి ఇవి ఆర్థిక పునాదిలో భాగంగా పరిగణించారు సోషలిస్టు స్త్రీవాదులు.
6. విప్లవ స్త్రీ విమోచనోద్యమాన్ని ప్రతిపాదించింది సాంస్కృతిక స్త్రీ వాదం. స్త్రీ విమోచనకు ప్రధాన శత్రువు పురుషుడని ప్రతిపాదించే రాడికల్ ఫెమినిస్టుల భావాన్నే సాంస్కృతిక స్త్రీవాదం బలపరుస్తుంది.
7. పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాల్లో స్త్రీవాదం పురుష వ్యతిరేక ధోరణిని కనబరిస్తే భారతదేశంలో స్త్రీవాదం పురుషులను ద్వేషించక పురుషాధిపత్యాన్ని, ఆధిపత్య స్వభావాన్ని రూపొందించే సామాజిక నిర్మాణాలను వ్యతిరేకిస్తుంది. స్త్రీవాదం శ్రామిక విముక్తి పోరాటంతో ఇతర విముక్తి పోరాటాలతో సంబంధం కలిగి ఉంది.

ఏంగెల్స్ దృక్పథం, చలం మోనోగమీ తత్త్వం స్త్రీవాద రచనలలో చోటుచేసుకున్నాయి. సుఖం అంతమైన బతుకులు ప్రతిబింబించే రచనలతో బాటు స్త్రీవాద వ్యతిరేక ధోరణిగల రచనలుకూడా వెలుగులోకి వచ్చాయి.

19వ శతాబ్దంలోనే స్త్రీ జాతికి స్వేచ్ఛను కల్పించాలనే ఆరాటం, దీక్ష, తపన అధికమై కలం బలంతో సంచలనం సృష్టించిన రచనలు మహిళా సమస్యల పట్ల సామాజిక స్పృహ పెరిగి స్త్రీలను చైతన్యవంతులను చేసి తత్ఫలితంగా మహిళా ఉద్యమాన్ని ప్రతిఫలింపజేసిన రచనలు తెలుగు సాహిత్యంలో రూపొందాయి. జాతీయోద్యమం, కమ్యూనిస్టు, మార్క్సి స్టు ఉద్యమాల నేపథ్యంలో సాంఘిక భద్రత కంటే స్త్రీ సమస్యలకే ప్రాధాన్యం ఇచ్చిన రచనలు వెలుగులోకి వచ్చాయి. స్వతంత్ర వ్యక్తిత్వం కోసం ఆరాటపడే స్త్రీలు స్త్రీవాద రచనలలో రూపుదిద్దుకున్నారు.

స్త్రీల సమస్యలే ఇతివృత్తంగా ఉన్న తొలి రచనలలో స్వేచ్ఛ కావాలనుకున్న స్త్రీ పాత్రలు సమాజానికి ఎదురీద లేక ఆత్మహత్యే పరిష్కారంగా ఎన్నుకున్నాయి. ఆ తర్వాత వచ్చిన రచనలల్లో స్వతంత్ర జీవనాన్ని గడపటానికి నిర్ణయించుకున్న పాత్రలు కనిపిస్తాయి. మాతృస్వామ్య వ్యవస్థ మరుగై పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ ఎదుర్కొంటున్న బానిసత్వం, ఆ బానిసత్వపు కారణాలే స్త్రీవాద రచనలకు మూలకారణం. అంటే రాతియుగానికి నేటి యుగానికి పురుష భావజాలంలో తేడా లేదని తెలుస్తుంది. పురుషుడు – స్త్రీ, యజమాని – బానిస సంబంధాన్ని కలిగి ఉండటం, ఆర్థికంగా భర్తపై ఆధారపడి ఉండటం, స్త్రీలు చేసే ఇంటి పనికి విలువలేక పోవటం, పిల్లల పెంపకం తల్లికే పరిమితం కావటం, కుటుంబంలో సాంఘిక సమానత్వం లేకపోవటం, స్త్రీ సంక్షోభం, సంఘర్షణ, జెండర్, లైంగికత... వీటి నుండి భద్రతను ఆశిస్తుంది స్త్రీవాదం.

'నారీ నరకస్య ద్వారం' అని మధ్యయుగం నాటి వారు విశ్వసించారు. ప్రలోభం కలిగించటానికే భగవంతుడు స్త్రీలను సృష్టించాడని స్త్రీలను ద్వేషించారు. స్త్రీలందరూ జగన్మాత కళలే అని దేవీమాహాత్మ్యం ఒకవైపు ఉగ్గడిస్తున్నా, కామం, క్రోదం, లోభం ఇవే నరక ద్వారమని భగవద్గీత వివరిస్తున్నా, కామిని కాంచనాలు పరమ పాతకాలని చెప్పిన శ్రీ రామకృష్ణ పరమహంస ప్రబోధాలు వినిపించినా లోకంలో భావజాలంలో మార్పు రాలేదు.

స్త్రీని గురించి ఉదాత్తంగా ఆలోచించేందుకు వ్యక్తికి స్వేచ్ఛ అవసరం. స్త్రీ ప్రలోభానికి లొంగిపోవటం ఎవరి తప్పు ? ఆమె తప్పా ? పురుషుని తప్పా ? పురుషునిలోని కామాన్ని ద్వేషించాలి కాని స్త్రీని కాదు. భక్తుడు తానే స్వయంగా ఒక స్త్రీయై భగవంతుని సేవించినపుడు మాత్రమే ప్రేమను సంపూర్ణంగా అవగతం చేసుకోగలడు. దివ్యప్రేమను ఆస్వాదించాలంటే స్త్రీని ద్వేషించకూడదు. పురుషుడు స్వయంగా స్త్రీ కావాలని అంటారు శ్రీ అరవిందులు.



రాజకీయ, ఆర్థిక, సామాజిక అణచివేతకు గురైన స్త్రీలు, లైంగిక వివక్షకు గురైనవారు సమానత్వం కోసం చేసిన తిరుగుబాటు ఉద్యమ రూపం దాల్చింది. స్త్రీ పురుష వివక్ష, శ్రమ, ఉత్పత్తి పరంగా స్త్రీ గౌణ స్థానాన్ని పొందింది. అనాదిగా స్త్రీ అనుభవిస్తున్న శారీరక మానసిక బాధలను అక్షరాకృతి ధరించింది స్త్రీవాద కవిత్వం. పురుష స్వామిక భావజాలంతో మార్పు రావాలని కోరుకుంటారు స్త్రీవాదులు.

1980–90 మధ్య కాలంలో స్త్రీవాద కవిత్వం ఉధృతంగా వచ్చింది. 'పెళ్ళంటే పెద్ద శిక్ష' అని భావించిన కవయిత్రి సావిత్రి. బతకటానికి 'నానా చావు చస్తున్న వాళ్ళం' అని ఓల్గా, రైలు పట్టాల మీద నాణెం విస్తరించిన బాధ అని కొండేపూడి నిర్మల, వంటింటి గిన్నెలన్నిటిపైన మానాన్న పేరే అని విమల స్త్రీవాద రచనలు చేపట్టారు.

నాయని కృష్ణకుమారి, జయప్రభ, రేవతీదేవి, సావిత్రి, కొండేపూడి నిర్మల, విమల, మెహజబీన్, ఘంటసాల నిర్మల, శీలా సుభద్రాదేవి స్త్రీవాద రచయితలుగా స్థిరపడ్డారు.

స్త్రీవాద ఉద్యమం వలన భవిష్యత్ చరిత్రలో స్త్రీలు 'మా అస్తిత్వాన్ని చూసి గర్వపడు తున్నాం' అని మెహజబీన్ 'డాటర్స్ కింగ్డమ్'లో స్త్రీలు సాధించిన ప్రగతికి గర్విస్తున్నారు. ప్రపంచమంతా స్త్రీలదే ఇక మగవాళ్ళ పునాదులు కదులుతున్నాయని స్త్రీల అస్తిత్వాన్ని ఆశించారు.

'మాతృహింస' కవితలో మాతృభూమి కూడ ఆడదాన్నే ఆసరా చేసుకుంది. భవిష్యత్తులో స్త్రీలు అన్యాయాల్ని ఎదిరిస్తారని ఆ రోజు వస్తుందని ఆశ.

తానెంత మాత్రమూ సహించనని
ఎలా శాసించగలదూ ?
శాసించగల రోజు
రేపటి చరిత్రలో ఉంది" [1] –మాతృహింస

"మనమూ రాత్రే అస్తమించవచ్చు
రేపు మనం చూడకపోవచ్చు
కాని ఆగమ వసంతాలలో
రెమ్మ రెమ్మా ఖడ్గమై విచ్చుకుంటుంది
మనం ఉన్నా లేకపోయినా
బానిస స్త్రీ ఉండదు
వసంతా !"[2] –వసంతా !

భవిష్యత్ మీద ఆశకానీ
గతం మీద రోతకానీ
ఆమెలో లేవు
'ఏదేమైతే నాకేం'[3] ఆమె,– కె. వరలక్ష్మి.

స్త్రీ పితృ స్వామ్యకాలం నుండి నేటి వరకు పడుతున్న బాధలను ఎదుర్కొంటున్న సాంఘిక అత్యాచారాలను ఓల్గా 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' కవితలో చిత్రించారు.

---

1. జయప్రభ, యశోధరా ఈ వగపెందుకే, చైతన్య తేజ పబ్లికేషన్స్, హైదరాబాదు, 1993, పుట 74.
2,3 నీలిమేఘాలు, స్త్రీవాద కవితాసంకలనం, స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాదు, 1993, పుట 94, 189.



"అందమైన దోపిడికీ
పవిత్రమైన హింసకూ
న్యాయమైన దాస్యానికీ
బలైపోయిన నేను
భారత స్త్రీని"[1] ఓల్గా, – ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి.

భారత స్త్రీ తరతరాలుగా అణచి వేయబడుతుంది. ప్రాచీన యుగంలో సతీసహగమనం, బాల్య వివాహంతోను, మధ్యయుగంలో స్త్రీ విలాసవస్తువుగా భావించ బడింది. ఆధునిక యుగంలో ధనిక, మధ్య తరగతి పేదరికంలో అణచి వేయబడింది. కాని భవిష్యత్తులో స్త్రీ పోరాడుతుందని తెలియజేస్తున్నారు.

---

1. నీలిమేఘాలు, స్త్రీవాద కవితాసంకలనం, స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాదు, 1993, పుట 94, 189.